క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల అందజేత



కొత్తకోట: మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, వాటర్‌మన్లు, ఇతర కార్మికులకు దుస్తులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే 57మంది కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతల బట్టలు, టవల్స్, నూనె, బ్లూ ప్యాంట్, బ్ల్యూ షర్ట్స్, సంతూర్ సబ్బులు 6, బట్టల సబ్బులు 6 చొప్పున కార్మికులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవీందర్, కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, నాగరాజు, పుట్టా ఆంజనేయులు, మండ్ల దేవన్న నాయుడు, బాలేమియా, అడ్వకేట్ కృపానందగౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో ఎత్తు ప్రాంతంలో ఉన్న పలు కాలనీల ప్రజలు తాగునీరు అందక ఎన్నో రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకుపోగా సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన పైపులైన్లు అమర్చే పనులు శనివారం ప్రారంభించారు. గ్రామంలోని 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు నుంచి 20 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా పైపులను అమరుస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ఇబ్బందులు పడ్డ కాలనీవాసుల సమస్య పరిష్కారం అవుతుందని, పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్సింహ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 26వ వార్డు టీచర్స్ కాలనీకి చెందిన యాటగిరి లక్ష్మయ్య మృతి చెందిన విషయాన్ని స్థానిక కౌన్సిలర్ రాములుయాదవ్ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నియోజకవర్గ సమన్వయ కర్త లక్కాకుల సతీష్ ఎమ్మెల్యే సూచన మేరకు లక్ష్మయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎమ్మెల్యే పంపిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రవియాదవ్, కృష్ణబాబు, మన్నెంకొండ, రవి ఉన్నారు.

సేవా కార్యక్రమాలతో ముందుకు..



ఆత్మకూర్: వాసవీక్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సంస్థ చైర్మన్ రేణికుంట్ల శ్రీనివాస్, ముఖ్య అతిథి కల్వ శ్రీనివాసులు, రీజియన్ చైర్మన్ కండె కృష్ణ, రీజియన్ సెక్రెటరీ గోటూర్ వెంకటేష్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో పలుసేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులకు ఫ్లోరోసెంట్ జాకెట్లు, రేయిన్‌కోట్లు అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, నోట్‌బుక్కులు, పెన్నులు, సీలింగ్‌ఫ్యాన్లు, వీధి వ్యాపారులకు గొడుగులు, కాలనీలో వాటర్‌ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, సుజన, రాఘవేంద్ర, దీప్తి, శివ, నీలేష్, రమేష్, నవీన్, రామకృష్ణ, మహేష్, శ్రీధర్, పవన్, రాము, రాఘవేంద్ర, వీణ, అర్పణ, సుధ, సింగం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములు పేదలకు పంచాలి

కొల్లాపూర్: మండలంలోని మొలచింతలపల్లి గ్రామ సమీపంలో అసద్‌పూర్ శివారు భూములను అర్హులకు పంచాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సురభి రాజసంస్థానానికి చెందిన వేల ఎకరాల భూములు అసద్‌పూర్ శివారులో ఉన్నాయని, వాటిని దశాబ్దాలుగా స్థానిక రైతులు సాగుచేసుకుంటున్నారని వివరించారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్



కనిమెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం అవుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కనిమెట్ట పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ గుంత మౌనిక కలిసి పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే కష్టపడి చదువుకోవాలని సూచించారు. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ స్కూల్స్‌లో తమ పిల్లలను చేర్పి ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వ స్కూల్స్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, రాంచంద్రయ్యయాదవ్, పరమేష్, వాకిటి బాలరాజు, బాలు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్, జములన్న, బాలస్వామి, శ్రీను, విద్యాకమిటీ చైర్మన్ బాలీశ్వరమ్మ, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించాలని కేతేపల్లి కాంప్లెక్స్ జీహెచ్ఎం శ్రీనివాసులు, మాందాపూర్ కాంప్లెక్స్ జీహెచ్ఎం ఆనంద్ అన్నారు. శనివారం ఆయా కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన జీహెచ్ఎంలకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా విద్యార్థులకు విద్యను అందించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా బోధన సాగాలన్నారు.



కేతేపల్లిలో..



దావాజిపల్లిలో..

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ..

మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కాంప్లెక్స్ జీహెచ్ఎం ఆనంద్, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. బడిఈడు కలిగిన ప్రతి పిల్లవాడు ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రూనాయక్, మాజీ సర్పంచులు ఠాకూర్‌నాయక్, వెంకటయ్యయాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడికి అండగా..



రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన వాకిటి రమేష్ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. మూడేళ్ల క్రితం హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు, ఎడమ చేయి రెండు చోట్ల విరిగిపోయాయి. అప్పటి నుంచి చికిత్స నిమిత్తం ఇంటికే పరిమితమయ్యాడు. కుటుంబ గడవలేని పరిస్థితిలో ఉండటంతో 1996–97లో పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదివిన చిన్ననాటి స్నేహితులు డబ్బులు పోగు చేసి, బాధితుడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కోలుకున్న కొంతకాలం తర్వాత మళ్లీ డ్రైవర్‌గా పనిలో చేరాడు. రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరోసారి కాలు విరిగిపోయింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఇంటి వద్దే ఉండి సాయం కోసం ఎదురుచూస్తున్న రమేష్‌ను మరోసారి బాల్య స్నేహితులు అక్కున చేర్చుకున్నారు. మేమున్నామంటూ ముందుకు వచ్చి వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయం అందరికీ తెలిసేలా పోస్టు చేయడంతో చలించిన చిన్ననాటి స్నేహితులు రూ.26వేలు జమ చేశారు. ఆ నగదును శనివారం రమేష్ ఇంటికి వెళ్లి గాయపడిన స్నేహితుడిని పరామర్శించి నగదును అందజేశారు. ప్రస్తుతం కుటుంబ గడవలేని పరిస్థితి ఉండటంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. తనను సహాయం చేయాలనుకునే వారు గూగుల్ పే, ఫోన్ పే నంబర్ 84669 41785 ద్వారా సహాయం చేయాలని వేడుకుంటున్నాడు.

గోవులను వధించే వారిని శిక్షించండి



ఎస్ఐ శ్రీహరికి ఫిర్యాదు చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

ఖిల్లాఘనపురం: దేశంలోని హిందువులంతా ఆరాధ్యదైవంగా పూజించే గోమాతను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బెస్త అంజనేయులు, బీజేపీ జిల్లా పంచాయతీరాజ్ సెల్ జిల్లా కన్వీనర్ విప్పటూరు విక్రం అన్నారు. గోవధను నిలిపివేయాలని కోరుతూ శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం ఎస్ఐ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా యథేచ్ఛగా గోవులను తరలించి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో ప్రత్యేకంగా దృష్టి సారించి గోవధకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. స్పందించిన ఎస్ఐ ప్రత్యేకంగా ఓ టీంను ఏర్పాటు చేసి నిఘా పెడతామని తెలిపారు. అనుమతులు లేకుండా గోవులను తరలించినా, వధించిన వెంటనే గుర్తించి శిక్షిస్తామన్నారు. మండలంలో ఇలాంటి ఘటనలు ఎవరికి తెలిసినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల నాయకులు పోలిశెట్టి శ్రీను, గిరి, సుంకరి అంజనేయులు, చిట్యాల లింగస్వామి, బీజేపీ జిల్లా ఓబీసీ కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, అక్కారి పెద్ద వెంకటేష్, దేవరశెట్టి వెంకటేష్, బెస్త మహేందర్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో శనివారం అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్త బుచ్చన్న కుటుంబసభ్యులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ పరామర్శించారు. ఆత్మకూర్‌లో కార్యకర్త రఘు కుటుంబసభ్యులను కలిసి పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీనియర్ నాయకుడు అజ్మతుల్లా జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గంగాధర్‌గౌడ్, జిల్లానాయకుడు రహ్మతుల్లా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోయారు. కొన్నిరోజుల నుంచి గ్రామంలో భగీరథ నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని తెలిపారు. ఎత్తు ప్రాంతంలో ఉన్న కొన్ని కాలనీలకు తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. దీనిపై ఎంపీడీఓ సద్గుణను వివరణ కోరగా.. నీటి సరఫరాలో అంతరాయం తమ దృష్టికి రాలేదని, మిషన్ భగీరథ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ మేరకు ఏఈ హరీష్, ప్రత్యేకాధికారి శ్రీరాంరెడ్డి గ్రామంలో పర్యటించి సోర్స్ బోర్లు, భగీరథ పైప్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకుంటామని, అంత వరకు సమస్య అధికంగా ఉన్న కాలనీల్లో ట్యాంకర్లతో నీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధయ్య, తిక్కన్న, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, నరేష్, వాటర్‌మెన్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు హరితహారానికి గుంతలను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండటంతో హరితహారానికి అవసరమగు గుంతల తవ్వకం ప్రక్రియ ప్రారంభించాలన్నారు. మండలంలోని 28 పంచాయతీలకు హరితహారం లక్ష్యం ఆయా గ్రామ పంచాయతీల జనాభాకు అనుగుణంగా ఒక్కొక్క జీపీకి 9 వేలు, 6 వేలు, 5 వేలు చొప్పున లక్ష్యాలు నిర్దేశించామని ఆయా లక్ష్యాలకు అనుగుణంగా మండలానికి 2.20 లక్షల మొక్కలను నాటాలన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చేపట్టిన పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందాలు పర్యటిస్తాయని రికార్డులు, పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీహెచ్ఎంలు విధుల్లో చేరిక

వీపనగండ్ల: మండలంలో మొత్తం 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో 5 పాఠశాలలకు బదిలీలో భాగంగా ఐదుగురు జీహెచ్ఎంలకు పోస్టింగ్‌లు ఇవ్వగా.. అందులో ముగ్గురు మాత్రమే విధుల్లో చేరారు. వీపనగండ్ల బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్ఎంగా బాలుప్రకాష్, కల్వరాలకు రాజవర్ధన్‌చారి, గోవర్ధనగిరి పాఠశాలలో నర్సింహులు విధుల్లో చేరగా.. బొల్లారం పాఠశాలకు కేటాయించిన దశరథం, వీపనగండ్ల బాలికల ఉన్నత పాఠశాలలో గంగాధర్ విధుల్లో చేరలేదు. తూముకుంట, సంగినేనిపల్లి ఉన్నత పాఠశాలలకు జీహెచ్ఎంలను కేటాయించకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురి అవుతున్నారు. విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకొని మిగిలిని నాలుగు పాఠశాలలకు జీహెచ్ఎంలను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు

అసంక్రమిత వ్యాధుల గుర్తింపుపై వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పాన్‌గల్: అసంక్రమిత వ్యాధుల గుర్తింపుపై శనివారం మండలంలోని మంగళ్లపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 30ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు కవిత, చిన్నమ్మ, సంధ్య, ప్రమీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకే కేటాయించాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని కొత్తకోట మండల ముదిరాజ్ సంఘం నాయకుడు రాజమౌళి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 5వేల చేపల సహకార సంఘాల్లో 4,300కు పైగా సంఘాల్లో ముదిరాజులే ఉన్నారని, కేవలం 700సంఘాలు కలిగిన బేస్త కులస్తుల వారిని చైర్మన్‌గా నియమించడం సరికాదన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి



ఉపాధ్యాయురాలు విశాలాక్షిని సన్మానిస్తున్న ఉపాధ్యాయురాలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయురాలు కె.విశాలాక్షి పదవీ విరమణ పొందింది. ఈ మేరకు శనివారం స్థానిక పాఠశాలలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాలాక్షి దంపతులను తోటి ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, విద్యార్థినులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కన్నీరు పెట్టుకుంటూ ఉపాధ్యాయురాలితో ఉన్న తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకం



ప్రణవికి నగదు బహుమతిని అందజేస్తున్న శిరీష దంపతులు

వనపర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యకు కొదవ లేదని, ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి గణేష్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఏఎంఓ మహానంది అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సమాజం నుంచి అనునిత్యం ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పలుస రవీందర్‌గౌడ్ స్మారకార్థం ఆయన కుమార్తె శిరీష, శ్రీధర్‌గౌడ్ దంపతులు రాజపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఆయా తరగతుల్లో ప్రతిభ చూపి మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహం అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో 9.7 జీపీఏ సాధించిన ఆర్.ప్రణవికి మొదటి బహుమతిగా రూ. 20,116, 9.0తో రెండో స్థానంలో ఉన్న ఎస్.సిరికి రూ. 15,116లు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా 9వ తరగతిలో అధిక మార్కులు సాధించిన టి.భవానికి రూ. 15,116, రెండో స్థానంలో ఉన్న పవన్‌కుమార్‌కు రూ. 12,116, 8వ తరగతిలో ఫస్ట్ నిలిచిన దివ్యకు రూ. 12,116, శ్రీదేవికి రూ.10,116, 7వ తరగతిలో ఫస్ట్ ఉన్న అఖిలకు రూ. 10,116, సెకండ్ బహుమతి నందినికి రూ. 8,116, 6వ తరగతిలో ఫస్ట్ ఉన్న కె.ప్రణవికి రూ. 8,116, సెకండ్ స్థానంలో ఉన్న ఆర్ భవానికి రూ. 6,116లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ చంద్రశేఖర్, జెడ్పీహెచ్ఎస్ రాజపేట స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు గౌడ్, స్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు రవికుమార్‌రెడ్డి, సాబేర్, ఏపీసీ చైర్‌పర్సన్ శంకరమ్మ, పీఎస్ రాజపేట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవ్వడంతో శనివారం వారిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో మొత్తం 43 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కాగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గౌతమ్‌చక్రి, అభిషేక్, జోస్న్య ఎంపికవ్వడం సంతోషించదగ్గ విషయమని ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి పూర్తయ్యే వరకు ఒక్కొక్కరికీ ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున రూ.48 వేలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వర్, బాలు, మౌలానా, శేఖర్‌నాయుడు, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



చంద్రనాయక్‌తండా పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

అమరచింత: చంద్రప్ప తండాకు చెందిన శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.పది వేల విలువ గల నోట్‌పుస్తకాలను చంద్రనాయక్‌తండా పాఠశాల విద్యార్థులకు వితరణ చేశారని హెచ్ఎం సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తనవంతు భాగస్వామ్యం కావాలన్న సంకల్పంతో విద్యార్థులకు పుస్తకాలు అందించానన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

భవిత విద్యార్థులకు..

పట్టణంలోని భవిత కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామని హెచ్ఎం బాలస్వామి, సీఆర్పీ స్వామి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: మున్సిపాలిటీలో జరిగిన అవినీతి పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా.. బాధ్యులపై చర్యలు తీసుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. అమరచింత మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా జరిగిన అవినీతి పనులపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అధికార పాలక మండలి సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ మంగమ్మ, ఆమె భర్తతో పాటు ఏఈ, అకౌంటెంట్, మున్సిపల్ కమిషనర్ భాగస్వామ్యంతో సుమారు రూ.9 కోట్లు కాజేశారని ఆరోపించారు.

హరితహారం పేరుతో రూ.64 లక్షలు

హరితహారం కోసం రూ.64 లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డులు సృష్టించారని, కానీ పట్టణంలో ఎక్కడ మొక్కలు కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయం కోసం గోదాం మరమ్మతుకు రూ.30 లక్షలు, మూడో పట్టణ ప్రగతి కార్యక్రమంలో రూ.14 లక్షలు కాజేశారని దుయ్యబట్టారు. ఎస్ఎఫ్‌సీ ఫండ్స్ నుంచి రూ.44లక్షలు, ఎస్టీ, ఎస్సీ కాలనీలో అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సి ఉండగా వీటిని ఇతర అవసరాలకు వినియోగించడం ఏమిటని ప్రశ్నించారు. 2022–23 సంవత్సరంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఏబీఎస్ ఫేక్ కంపెనీ చూపించి బిల్లులు చెల్లింపు చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. 2020–23 వరకు జేసీబీ, ట్రాక్టర్లతో మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో పనులు చేశామంటూ రూ.44 లక్షలు వినియోగించారన్నారు. ఖర్చు చేసిన నిధులతో కొత్తగా జేసీబీని కొనే అవకాశం ఉందన్నారు. నీటి సరఫరా కోసం 5 బోర్లు వేయడానికి రూ.11 లక్షలు, ఐదోవార్డులో అంగన్‌వాడీ భవనం దాని చుట్టూ మరమ్మతు కోసం రూ.7 లక్షలు దోచుకున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీలో జరిగే పనులకు టెండర్లు లేకుండానే నామినేటెడ్ పనులను చేశారని తెలిపారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

మండలంలోని 87 ఎకరాల వక్ఫ్ భూమితో పాటు విలువైన ప్రభుత్వ, గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వీటి పరిరక్షణ కోసం కలెక్టర్‌కు విన్నవించామన్నారు. పెద్దచెరువు శిఖంలో బీజేపీకి చెందిన నాయకుడు 8 ఎకరాలు కాజేశారని ఆరోపించారు. వీటిపై కాంగ్రెస్ పరంగా పోరాడి వాటిని కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, పట్టణ, మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాందిన్నె తండా, చంద్రబండతండాలలో నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సిబ్బంది, కొల్లాపూర్ ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కొల్లాపూర్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. మారేడుమాందిన్నెతండాకు చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఈసూఫ్అలీ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.